సాక్షి
కాకినాడ

గురువారం | 12 | సెప్టెంబర్ | 2024



లక్ష విరాళం
దేవరపల్లి: యర్నగూడెం కల్యాణ వేంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాల కోసం నూలు వెంకట శ్రీనివాస్, అలివేలు మంగతాయారు దంపతులు (శ్రీలక్ష్మీనరసింహ ఇండస్ట్రీ) రూ. లక్ష విరాళం అందజేశారు.



కళాకారులకు కూనవరం
కూనవరం ఉప్పలగుప్తం మండలంలో ఒక కుగ్రామం. కానీ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు... కళాకారులకు.. కళా పోషకులకు పెట్టింది పేరు.

8లో

సోలార్.. సో బెటర్


సహజ వనరుల్లో విండ్ పవర్, జియో థర్మల్ పవర్, సోలార్ పవర్ ఇలా ఎన్నో ఉన్నా... జనమంతా సోలార్ పవరే సో బెటర్ అంటున్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆదరణ పొందుతోంది.

న్యూస్‌రీల్

ఏలేరులో 21.80 టీఎంసీల నీరు



ఏలేరులో ప్రస్తుత నీటినిల్వలు

ఏలేశ్వరం: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఏలేరు ప్రాజెక్టులో 21.80 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ఎగువప్రాంతం నుంచి వరదనీరు తగ్గడంతో దిగువప్రాంతానికి నీటి విడుదల స్వల్పంగా తగ్గించారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతం నుంచి 2275 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 85.42 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.80 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దిగువ ప్రాంతానికి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతోపాటు విశాఖకు 2275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వరద బాధితులకు వైద్యుల విరాళం



ఎమ్మెల్యే యనమల దివ్యకు చెక్కును అందజేస్తున్న ఐఎంఏ వైద్యులు

తుని రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు సాయంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తుని, పాయకరావుపేట వైద్యులు రూ.3.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే యనమల దివ్య, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడికు అందజేశారు. బుధవారం తుని మండలం తేటగుంటలో తన క్యాంపు కార్యాలయంలో ఉన్న వారిని కలసిన ఈ చెక్కును అందజేశారు. ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్వీ సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, కోశాధికారి డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ ఎ.రఘునాథరావు పాల్గొన్నారు.

ధర్మపురి లే అవుట్‌లో చిరుత జాడ



ధర్మపురి లే అవుట్ ప్రాంతంలో బోనును ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది



అధికారులు గుర్తించిన చిరుత పాద ముద్రలు

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీకి చేరువగా ఉన్న ధర్మపరి లే అవుట్ ఏరియాలో చిరుత పులి సంచరిస్తున్నట్టుగా అటవీశాఖ అధికారులు బుధవారం సాయంత్రం గుర్తించారు. ఆ ప్రాంతంలో చిరుత పాద ముద్రలను గుర్తించి, వెంటనే ఆ ప్రాంతంలో కూడా ఇనుప చట్రాలతో కూడిన బోనును ఏర్పాటు చేసి, చిరుతపులిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కారణంగా ఆ ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు రావొద్దని హెచ్చరించారు.


పుష్కర వనం తాత్కాలికంగా మూసివేత

దివాన్‌చెరువు, లాలాచెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలలో చిరుత పులి సంచారం నేపథ్యంలో లాలాచెరువులో ఉన్న గోదావరి మహాపుష్కర వనాన్ని ఈ నెల 16వ తేదీ వరకు అటవీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. అయితే ఈ మూసివేత పులి దొరికే వరకు కొనసాగవచ్చని తెలుస్తోంది. చిరుతపులి జాడ కోసం తమ బృందాలు నిరంతరం గాలిస్తున్నాయని డీఎఫ్ఓ ఎస్.భరణి తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ రోమింగ్ వైఫై ప్రారంభం

సీటీఆర్ఐ: భారత ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ రోమింగ్ వైఫై ప్రారంభించిందని ఆ సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు అన్నారు. ఇందులో రిజిస్టర్ అయినవాళ్లు ఎక్కడకు వెళ్లినా అక్కడ బీఎస్ఎన్ఎల్ వైఫై తో కనెక్ట్ కావచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌లోని నన్నయ సంచార్ భవన్‌లో బుధవారం బిజినెస్ డెవలప్‌మెంట్, విస్తరణ అంశాలపై ఆయన సమావేశం నిర్వహించారు.

ఖరీఉఫ్



పిఠాపురం మండలంలో నీట మునిగిన పొలాలు



వరద నీటిలో మునిగిన పిఠాపురం 216 జాతీయ రహదారి

- కన్నీరు పెడుతున్న అన్నదాత
- 1.10 లక్షల ఎకరాల్లో వరి మునక
- 80 వేల ఎకరాల్లో నష్టం తప్పదు
- 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలకు నష్టం



వరద నీటిలో పిఠాపురం పట్టణం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఖరీఫ్ సాగుపై మెట్ట ప్రాంత రైతులు పెట్టుకున్న ఆశలు ఆవిరైపోయాయి. వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా పొలాలను చూస్తూ విలపిస్తున్న రైతులే కనిపిస్తున్నారు. ఈ సీజన్‌లో ఖరీఫ్‌కు డోకా లేకుండా ఏలేరు నుంచి సాగునీరందుతుందనే సంతోషం మెట్ట ప్రాంత రైతుల కళ్లల్లో ఎన్నో రోజులు నిలవలేదు. రెక్కల కష్టాన్నే నమ్ముకుని అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వేసిన ఖరీఫ్ పంట కళ్లెదుటే ఏలేరు వరదపాలైంది. జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో పంటల మీదుగా ముంపునీరు ప్రవహిస్తోంది. ఏలేరు పరీవాహక ప్రాంతంలో ప్రధానంగా సుద్దగెడ్డ, గొర్రిఖండి వంటి ఏరులు పొంగి ప్రవహిస్తూ పంటలను ముంచెత్తాయి. రెండు, మూడు రోజులుగా పంటలన్నీ వరద నీటిలో ఉండిపోవడంతో కుళ్లిపోవడం ఖాయమైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో నాట్లు వేసి సరిగ్గా నెల రోజులైంది. జిల్లాలో మెజార్టీ ఆయకట్టులో వరి పంట పిలకలు వేసి దుబ్బులు చేసింది. గింజ పాలుపోసుకునే దశ దాటి గట్టి పడి ఉంటే కొద్దోగొప్పో పంటపై రైతులు ఆశలు పెట్టుకునే వారు. కానీ ఇందుకు భిన్నంగా మెజార్టీ పొలాల్లో వరి పంట ఇప్పుడిప్పుడే పాలుపోసుకునే దశకు చేరుకుంది. ఒక్క వారం ఆగి ఉంటే ఈ రోజు పంట గట్టెక్కేసేదేనని రైతులు చెబుతున్నారు.

ఇలా జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట తదితర మండలాల్లో లక్షా 10 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని అధికారులు ప్రాథమికంగా లెక్కలు కట్టారు. వీటిలో కనీసం 80 వేల ఎకరాలలో పంట నష్టం సంభవించే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యవసాయాధికారులు అంచనాకు వచ్చారు. ఇవి కాకుండా మరో 20 వేల ఎకరాల్లో ప్రత్తి, మిరప, మొక్కజొన్న, కూరగాయలు వంటి వాణిజ్య పంటలు ముంపునకు గురై జీవనోపాధి లేకుండా చేసిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ప్రభావంతో ఒక్క పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లో సుమారు 22 వేల ఎకరాలలో వరి, వాణిజ్య పంటలు పూర్తిగా మునిగిపోయాయి. మరో రెండు రోజుల పాటు వరద భీబత్సం కొనసాగనుండడంతో పంటలు కుళ్లిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. పిఠాపురం మండలంలో విరవాడ, విరవ, మంగితుర్తి, కోలంక, ప్రత్తిపాడు, భోగాపురం, రాయవరం, రాపర్తి తదితర గ్రామాలు నీట మునగగా, గొల్లప్రోలు మండలంలో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు తాటిపర్తి, చెందుర్తి, వన్నెపూడి, చేబ్రోలు, కొత్తపల్లి మండలంలోని రమణక్కపేట, ఇసుకపల్లి, నాగులాపల్లి, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి కొత్తపల్లి తదితర గ్రామాల్లో వరి, వాణిజ్య పంటలను వరద ముంచేసింది. పెద్దాపురం నియోజకవర్గం కాండ్రకోట, మర్లావ, పాత పెద్దాపురం, గుడివాడ, సిరివాడ, పవర, అచ్చింపేట, చంద్రంపాలెం, వీకే రాయపురం, సామర్లకోట తూర్పుపాకల, జె.తిమ్మాపురం, కట్టమూరు, జగ్గంపేట మండలం కాట్రావుపల్లి తదితర ప్రాంతాల్లో 10 వేల ఎకరాల వరి పంట నీట మునిగిందని అధికారులు అంచనాకు వచ్చారు. జగ్గంపేట నియోజకవర్గం రాజుపాలెం, భూపాలపట్నం, కృష్ణవరం, సోమరాయణంపేట, పాలెం, ముక్కొల్లు, కాట్రావులపల్లి, రామవరం, సీతానగరం తదితర ఆయకట్టులో సుమారుగా ఐదు వేల ఎకరాలు ముంపులో ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, నియోజకవర్గ కేంద్రం పెద్దాపురం మండలంలో అత్యధికంగా వరి, ఇతర వాణిజ్య పంటలు మునిగిపోవడంతో చేను కుళ్లిపోయి రైతులు దాదాపు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది.

వరి, వాణిజ్య పంటలు పూర్తిగా నీటిలో మునిగిపోయి రెండు రోజులు గడచిపోవడంతో పాక్షికంగా కూడా పంట కాపాడుకునే వాతావరణం లేదంటున్నారు. ముంపులో పొలాలు మూడు రోజులు దాటి ఎక్కువ రోజులు ఉంటేనే నష్టం ఉంటుందని మూడు రోజుల్లోపు నీరు తగ్గితే తగిన రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. మూడు రోజులు నీటిలో ఉన్న పంట నాలుగో రోజు బయటపడినా 70 శాతం నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాలో పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల్లో ఏలేరు వరదల వల్ల వేలాది ఎకరాలు గత మూడు రోజులుగా నీట మునగగా మరో రెండు రోజులు నీటిలోనే ఉండే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంట వంద శాతం నష్టం తప్పదంటున్నారు.

'పంటపై ఆశలు వదిలేసుకున్నాం'



నాపేరు అబ్బిరెడ్డి చక్రయ్య మాది కొత్తపల్లి మండలం రమణక్కపేట నేను 17 ఎకరాలలో వరి పంట వేశాను. ఎకరానికి ఇప్పటి వరకు రూ.20 వేల వరకు పెట్టుబడి అయ్యింది. ప్రస్తుతం దుబ్బు తయారై చిరుపొట్టదశకు చేరుకునే సమయంలో వరద వచ్చి నిండా ముంచేసింది. రెండు మూడు రోజుల్లో వరద తగ్గినా పంట పూర్తిగా నష్టపోతున్నాం. ఈ ఏడాది ఖరీఫ్ పంట పూర్తిగా నష్టపోక తప్పదు. మళ్లీ దాళ్వా మాత్రమే వేసుకోవాలి తప్ప మరి ఏ విధంగాను పంటలకు పని చేయదు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి అంతా పోయినట్టే చిల్లిగవ్వ తిరిగి చూడలేం. పెట్టుబడికి వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. అధికారులు ఏ విధంగా నష్టం అంచా వేస్తున్నారో మాకు తెలియడం లేదు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో నష్ట పరిహారం ఇవ్వడానికి చర్యలు తీసుకోక పోతే మా బతుకులు రోడ్డున పడతాయి.

పంట పూర్తిగా నష్టపోయా..



నా పేరు ఇంటి వెంకట్రావు, మాది సామర్లకోట మండలం వీకే రాయపురం. నేను ఆరు ఎకరాలు సాగుచేస్తున్నాను. గత రెండు నెలలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తునే ఉన్నాయి. దీంతో నాతో పాటు వీకే రాయపురంలో రైతులు సుమారు 300 ఎకరాల్లో వేసిన వరినాట్లు ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు కుళ్లిపోయాయి. దాంతో రెండో పర్యాయం వరి నాట్లు వేసుకోవలసి వచ్చింది. నేను ఇప్పటి వరకు ఎకరానికి నాట్లుకు, కూలీలకు, మందులకు తదితర వాటికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. వ్యవసాయాధికారులు ముంపును పరిశీలించి వెళ్లారు. విత్తనాలు కూడా సబ్సిడీపై ఇవ్వలేదు. వ్యవసాయం చేయాలంటే భయం వేస్తోంది. నా పంటకు నష్ట పరిహారం ఇప్పించవలసిందిగా అధికారులను కోరుతున్నాను.

పెట్టుబడి నీటిపాలైంది



మాది కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామం. నా పేరు శరకణం సత్తిబాబు. వదర నీటితో మా వరి పంట పూర్తిగా నీట మునిగింది. 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేశాను. ఇప్పటికి ఎకరాకు సుమారు 24 వేలు చొప్పున రూ.1.92 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. పంట దుబ్బు చేస్తున్న సమయంలో ఏలేరు కాలువ నుంచి భారీగా వచ్చిన వరద వచ్చి పంట మునిగింది. పెట్టుబడులకు తెచ్చిన అప్పులు, రైతుకు మగతా ఎలా కట్టలో దిగ్గుతోచని స్థితిలో ఉన్నాను. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి



వరద నీట మునిగిన పిఠాపురం జాతీయ రహదారి



తోటూరుకు వెళ్లే రోడ్డులో పొంగి పొర్లుతున్న వరదనీరు



నాగులాపల్లిలో నీట మునిగిన వరి పొలం

హారిక కుటుంబానికి రూ. 5 లక్షలు అందజేత



హారిక తల్లి అన్నపూర్ణకు రూ.5 లక్షలు సహాయం అందజేస్తున్న మాజీ మంత్రి కన్నబాబు

మాజీ సీఎం జగన్ ప్రకటించిన సాయాన్ని అందజేసిన కన్నబాబు

కాకినాడ రూరల్: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టరు పేలుడు ఘటనలో మృతి చెందిన కాకినాడకు చెందిన ట్రైనీ కెమికల్ ఇంజినీర్ చల్లపల్లి హారిక కుటుంబానికి వైఎస్సార్ సీపీ తరపున మాజీ సీఎం జగన్ ప్రకటించిన రూ.5 లక్షల సహాయం చెక్కును మాజీ మంత్రి కురసాల కన్నబాబు అందజేశారు. నగరంలోని 2వ డివిజన్ స్థానిక సౌజన్యనగర్‌లో హారిక నివాసానికి బుధవారం ఉదయం వెళ్లి ఆమె తల్లి అన్నపూర్ణ, కుటుంబ సభ్యులను కన్నబాబు పరామర్శించి అండగా ఉంటామని ఓదార్చారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ గత నెల 21న అనకాపల్లి సమీపంలో ఫార్మా కంపెనీలో ప్రమాదం ఘటన బాధితులను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారని, తన వంతుగా వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయంగా రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ఈ ఘటనలో హారిక మృతితో ఒంటరిగా మారిన తల్లి అన్నపూర్ణను చూస్తే కళ్ళు చెమరుస్తున్నాయన్నారు. భర్త, కొడుకు దూరమైన ఆమెకు నేడు హారిక మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుత్తుల ప్రకాష్, సూరవరపు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై ముగ్గురి సస్పెన్షన్

- ఒకరికి షోకాజ్ నోటీసు జారీ
- వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని అన్నవరం ఈఓ ఆదేశం



అన్నవరం: రత్నగిరి దత్తత దేవాలయమైన కోరుకొండ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో రూ.16 లక్షల గోల్‌మాల్ విషయమై ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అన్నవరం దేవస్థానానికి చెందిన జూనియర్ అసిస్టెంట్ కె.సతీష్, రికార్డ్ అసిస్టెంట్ టి.అనిల్‌కుమార్, కోరుకొండ దేవస్థానానికి చెందిన రికార్డు అసిస్టెంట్ టి.రవికుమార్‌ను ఈ మేరకు సస్పెండ్ చేశారు. అలాగే కోరుకొండ దేవస్థానం వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ కె.సూర్యనారాయణ (శివ)కు షోకాజ్ జారీ చేశారు. గత ఏడాది నుంచి అన్నదానం అకౌంట్, మెయిన్ అకౌంట్లు అప్‌డేట్ చేయకపోవడంలో వారి నిర్లక్ష్యం ఉన్నట్టు ప్రాథమికంగా తేలిందని ఈఓ ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అలాగే వారి వ్యవహార శైలి వల్ల భక్తులకు తప్పుడు సంకేతాలు వెళ్లాయని అన్నారు. సస్పెండ్ అయిన, షోకాజ్ అందుకున్న ఉద్యోగులు వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఈ ఘటనపై విచారణ అధికారిగా అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ పి.వి శ్వనాథరాజును ఈఓ నియమించారు.

హమ్మయ్య.. సీఎం సమీక్ష రద్దు!



సామర్లకోట టీటీడీసీలో చంద్రబాబునాయుడు రివ్యూ కోసం ఏర్పాటు చేసిన వేదిక

- సమావేశాల్లో తరచుగా అధికారులపై ఆగ్రహం
- ఈ నేపథ్యంలో ఊపిరి పీల్చుకున్న అధికారులు

సామర్లకోట: వరద బాధితులను పరామర్శించడానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామర్లకోట టీటీడీసీలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే రాజుపాలెంలోనే 4.30 అయిపోవడంతో ఆ సమావేశాన్ని రద్దు చేసుకొని విజయవాడకు బయలు దేరారు. సమావేశం రద్దయిన విషయం తెలుసుకున్న జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమీక్ష సమావేశాల్లో సీఎం చంద్రబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. అయితే అటువంటి పరిస్థితి లేకుండా రద్దవడంతో ఉదయం నుంచి వేచి ఉన్న అధికారులు బతికిపోయాం అనుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు చంద్రబాబునాయుడు హెలికాప్టర్ దిగిన సమయంలో జిల్లా స్థాయి అధికారులు టీటీడీసీకి చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు వేచి ఉన్న తరువాత సమావేశం రద్దు అయిందని తెలిసి కొంత మంది ఆనందం వ్యక్తం చేయగా, మరికొందరు చంద్రబాబుతో రివ్యూ మీటింగ్ మిస్ అయ్యామని బాధను వ్యక్తం చేశారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోనే అనేక మంది కార్యకర్తలు టీటీడీసీలో ముఖ్యమంత్రిని కలుసుకోడానికి వేచి ఉన్నారు. రివ్యూ రద్దు కావడంతో కార్యకర్తలు, నాయకులు నిరాశ వ్యక్తం చేశారు. అలాగే వినతిపత్రాలు ఇవ్వడానికి టీటీడీసీ వద్ద వేచి ఉన్న అనేక మంది నిరాశ చెందారు. రాజుపాలెం నుంచి సీబీఎం సెంటర్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణకు చేరుకొని హెలికాప్టర్‌లో విజయవాడ బయలు దేరారు.

ఆదిశంకర మార్గ్ పునరుద్ధరణ

అన్నవరం: రత్నగిరిపై ఆదిశంకర మార్గ్‌లో వాహనాల రాకపోకలను బుధవారం నుంచి పునరుద్ధరించారు. ఇటీవల ఈ రోడ్డులో కొండపై నుంచి బండ రాయి పడడంతో దానిని మూసివేసిన విషయం తెలిసిందే. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఈ మార్గాన్ని పరిశీలించి అనంతరం పునరుద్ధరించారు.



తొలగించిన స్టాపర్

క్లుప్తంగా

గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గండి చెరువు పాలేటి వాగులో గల్లంతైన దుమంతుని గూడెంకు చెందిన సీహెచ్ శాంతారావు (32) మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. చెరువుకు కిలోమీటరు దూరంలో వాగు పొదల్లో మృతదేహం కనిపించింది. రెండు రోజుల నుంచి శాంతారావు మృతదేహం కోసం స్థానిక ఎస్సై సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గజఈత గాళ్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి

కిర్లంపూడి: వరద నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి ఘటనపై బుధవారం స్టేషన్‌లో కేసు నమోదైనట్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకట రమణ తెలిపారు. వివరాల్లోకి వెళితే మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతిన సుబ్బారావు(35) మంగళవారం రాత్రి వరద నీటిలో పడి కొట్టుకుపోయాడు. బుధవారం తెల్లవారుజామున స్థానిక కాలనీ తుప్పల్లో సుబ్బారావు మృతదేహం లభ్యమైంది. మృతుని భార్య గొంతిన నాగమణి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మంగళసూత్రాల తాడు చోరీ

అయినవిల్లి: స్థానిక కంఠంశెట్టి వారి వీధిలో బుధవారం తెల్లవారుజామున మహిళపై దాడి చేసి ఆమె మెడలో బంగారు మంగళ సూత్రాల తాడును గుర్తుతెలియని దుండగుడు దొంగిలించాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంఠశెట్టివారి వీధిలో వగ్రే అనంత లక్ష్మి (60) ఇంట్లోకి బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు చొరబడి కర్రతో ఆమె తలను గాయపరచి మెడలో మూడు తులాల బంగారు తాడును లాక్కుని పారిపోయాడు. దీని విలువ రూ.72 వేలు ఉంటుంది. కేకలు వేయగా ఆమె భర్త సత్యనారాయణ, స్థానికులు లేచి గాయపడిన ఆమెను 108లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని సీఐ భీమరాజు, ఎస్సై కె.మనోహరజోషి, క్లూస్ టీం పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగినప్పుడు భర్త సత్యనారాయణ ఇంట్లోనే ఉండటం గమనార్హం.

నాలుగు వాహనాల సీజ్



జొన్నాడలో సీజ్ చేసిన వాహనాలు

ఆలమూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను, తవ్వకాలు జరుపుతున్న ఒక జేసీబీని ఆలమూరు పోలీసులు సీజ్ చేశారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం జొన్నాడ ఎస్.మలుపు వద్ద ఉన్న పాత ఇసుక స్టాక్ పాయింట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదు అందింది. దీనిపై సత్వరమే స్పందించిన ఎస్సై అశోక్ తమ సిబ్బందితో కలసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మూడు లారీలతో పాటు జేసీబీని సీజ్ చేసి స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇసుక అక్రమ రవాణాలో ప్రమేయం ఉన్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి పలువురిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులకు కూనవరం

- గణపతి ఉత్సవాల్లో నాటకాలకు ఊపిరి
- ఎనిమిది దశాబ్దాల చరిత్ర
- హాస్యబ్రహ్మ పద్మనాభం నుంచి.. నేటి జబర్దస్త్ అప్పారావు వరకు...
- స్టేజ్ మీద అతిథి డైలాగులు చెప్పిన దివంగత ఎస్వీఆర్



దేవనర్తకి నాటకం (ఫైల్)



కూనవరంలోని కర్షక గణపతి ఉత్సవ కమిటీ నాటక ప్రాంగణం

సాక్షి, అమలాపురం/ఉప్పలగుప్తం: కూనవరం. ఉప్పలగుప్తం మండలంలో ఒక కుగ్రామం. కానీ జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులకు... కళాకారులకు.. కళాపోషకులకు పెట్టింది పేరు. నాటకాలను రక్తి కట్టించిన నటులు పుట్టిన గ్రామం. అలాగే తెరమరుగవుతున్న నాటకాన్ని పొత్తిళ్లలో పెట్టుకుని పోషిస్తున్న గ్రామం కూడా. ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన అక్కడి కర్షక గణపతి ఉత్సవ కమిటీ.. ఏటా నవరాత్రులు చేయడం.. సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించే ఏర్పాట్లు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

కూనవరం గ్రామంలో పూర్వం వ్యాసాలు, కవితలు రచించిన పండితులు ఉండేవారు. అందుకే ఈ గ్రామాన్ని 'పండిత కూనవరం' అని పిలిచేవారని ఇక్కడ వారు చెబుతారు. తరువాత ఇక్కడ కళాకారులు పుట్టుకొచ్చారు. సాంఘిక నాటకాలు ప్రదర్శిస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని కళాకారుల కూనవరంగా కూడా గుర్తింపు తెచ్చారు. వీరు నటించిన 'పూలరంగడు, రక్త కన్నీరు, అల్లూరి సీతారామరాజు, కత్తుల రత్తయ్య, సారంగధర, బొబ్బిలి యుద్ధం, కుమారరాజా, చిల్లర కొట్టు చిట్టెమ్మ' వంటి నాటకాలు సినీ ప్రముఖులతో శభాష్ అనిపించుకున్నాయి. గత ఎనభై ఏళ్లుగా సత్య హరిశ్చంద్ర, బాలనాగమ్మ, దేవనర్తకి, నర్తనశాల, రామాంజనేయ యుద్ధం, కృష్ణార్జున యుద్ధం, కురుక్షేత్రం, శ్రీకృష్ణ తులాభారం, మనోహర్, మయసభ, కదలివచ్చిన కనకదుర్గ, తులసీ జలంధర, మహిషాసురమర్దిని, అన్నమయ్య, భూకైలాస్, మహావీర చంద్రసేన, వల్లీ కళ్యాణం, పౌరాణిక నాటకాలు ఏటా 250 నుంచి 300 కళాకారులతో ఈ ఉత్సవాల్లో ప్రదర్శనలు చేసి నాటకాలకు ఊపిరి పోస్తున్నారు.

సినీ నటుల ప్రదర్శన..

కర్షక గణపతి వేదికపై దివంగత హాస్య నటుడు పద్మనాభం పలుసార్లు దేవనర్తకి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర పోషించారు. ఇప్పుడు ఇదే నాటికలో జబర్దస్త్ నటుడు, సినీ హాస్యనటుడు అప్పారావు సుబ్బిశెట్టి పాత్రలో నటించనున్నారు. మహానటుడు ఎస్వీ రంగారావుకు ఈ గ్రామస్తులతో బంధుత్వం ఉంది. శ్రీరామ నవరాత్రులకు వచ్చిన ఎస్వీఆర్ ఇక్కడ వేదికపై అతిథి పాత్రలో మాయాబజార్‌లో ఘటోత్కచుడు, హిరణ్యకశిపుడుల్లోని డైలాగులు చెప్పి ప్రేక్షకులను అలరించారు. ఉమ్మడిగోదావరి జిల్లాలో ప్రముఖ నాటక కళాకారులు జగతా పెదకాపు, ఆచంట వెంకటరత్నంనాయుడు, షణ్ముఖ ఆంజనేయరాజు, మద్దాల రామారావు, ద్వారపూడి సూర్యారావు, పేపకాయల లక్ష్మణరావు, బెజవాడ రామారావు, యెరుబండి మునేశ్వరరావు, బత్తిన నాగేశ్వరరావు వంటి హేమాహేమీలు నటించారు. ఇప్పుడు నవరాత్రుల్లో నాటకాల ప్రదర్శన చాలా వరకు తగ్గింది. దీనితో నాటకాలతో పాటు బుర్రకథ, హరికథలు, పద్యనాటకాల పేరుతో పౌరాణిక నాటకాల ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

నాటకాలు చూసి ఆసక్తి పెంచుకున్నాను



మా గ్రామంలో జరిగే వినాయకచవితి ఉత్సవాల్లో చేసే నాటక ప్రదర్శనలు చూసి నాటకాలపై ఆసక్తి పెంచుకున్నాను. రెండు మూడు నెలల్లో సాంఘిక నాటకాలు నేర్చుకుని మా గ్రామంలో ప్రదర్శనలు చేశాం. సినీ దర్శకులు సైతం మా నాటకాలను మెచ్చుకున్న సందర్భాలున్నాయి.

– **ఆకుల సత్యనారాయణ**, పూలరంగడు నాటక పాత్రధారి, కూనవరం, ఉప్పలగుప్తం మండలం

ఆ పేరు నిలబెట్టేందుకే..



పూర్వం మా గ్రామానికి పండిత కూనవరం.. కళాకారుల కూనవరం అనే పేరు ఉండేది. ఆ పేరును పోషించడానికే అల్లూరి సీతారామరాజు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, ప్రాణ స్నేహితులు అనే సాంఘిక నాటకాల ప్రదర్శించాం. మా నాటకాలు స్థానికంగా ఉన్న సినిమా థియేటర్లలో సైతం ప్రదర్శనలు చేశాం.

– **ఆకుల ఆదినారాయణ**, గణపతి కమిటీ నిర్వాహకుడు, కూనవరం, ఉప్పలగుప్తం మండలం

ప్రతిరోజూ పండగలా జరుపుతాం



వినాయక చవితి ఉత్సవాలను 11 రోజులు పండగలా చేస్తాం. అది మాకు పెద్దల నుంచి వచ్చిన ఆచారం. కళను కళాకారులను పోషించాలనే ఏటా సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నాం. ఏటా మండలంలో ప్రత్యేక ఆకర్షణగా మా ఉత్సవం నిలుస్తుంది.

– **ముచ్చర్ల సత్యనారాయణ**, కమిటీ సభ్యుడు, కూనవరం, ఉప్పలగుప్తం మండలం

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక రేవు నుంచి ములకల్లంకకు వెళుతున్న పడవకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పడవ నడుపుతున్న వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించి పడవను ఒడ్డుకు చేర్చాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే కాకినాడ సమీపాన మెట్టుపల్లికి చెందిన ఇరువురు యువకులు ములకల్లంక బంధువులకు పెళ్లి కార్డులు ఇవ్వడానికి బొబ్బిల్లంక రేవుకు చేరుకున్నారు. గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నా అధికారులు ఏర్పాటు చేసిన బోటు ఒడ్డున ఉంచారు. ప్రయాణికులను మరపడవలపై తరలిస్తున్నారు. మోటుపల్లి నుంచి వచ్చిన యువకులు బొబ్బిల్లంక రేవులో మరపడవ ఎక్కి యాభైమీటర్ల దూరం ప్రయాణించగా పడవ ఇంజిన్ ఫ్యాన్ ముక్కలుగా విరిగిపోయింది. దాంతో పడవ విపరీతంగా ఊగుతూ తిరగబడే పరిస్థితి ఏర్పడింది. దీంతో నడుపుతున్న వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించి పడవను ఒడ్డుకు చేర్చడంతో ఇద్దరు యువకులు ఊపిరి పీల్చుకున్నారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి



కాకర్ల నారాయణమూర్తి

కాకినాడ రూరల్: కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన కౌలు రైతు కాకర్ల నారాయణమూర్తి (38) బుధవారం పాముకాటుతో మృతి చెందాడు. కరప పోలీసుల కథనం మేరకు వరిచేనుకు మందు పిచికారీ చేస్తుండగా నారాయణమూర్తి కాలిపై తాచుపాము కాటు వేసింది. వెంటనే ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలపగా వారు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి తెలియజేశారు.

అంత్యక్రియలకు అడ్డంకిగా వరద

- మోసుకెళ్లే దారిలేక బోటుపై తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- కాకినాడ జిల్లాలో విషాద ఘటన



మృతదేహాన్ని బోటుపై తీసుకు వెళుతున్న వీఆర్వో పరమేశ్వరరాజు

పిఠాపురం: కుటుంబ సభ్యుడు మృత్యువాత పడటంతో వరదలో మృతదేహాన్ని తీసుకెళ్లే దారి లేక ఆ కుటుంబం తల్లడిల్లింది. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు సూరంపేట వరద నీటిలో మునిగిపోయింది. నాలుగు రోజులుగా గ్రామం విడిచి బయటకు వెళ్లే అవకాశం లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఈ ప్రాంతానికి చెందిన ఇస్సరపు సూరిబాబు (62) అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి వరకు తమతో కలసి ఉన్న కుటుంబ సభ్యుడు అశువులు బాశాడన్న విషాదంలో ఉన్న మృతుడి కుటుంబానికి అంత్యక్రియల నిర్వహణ కత్తిమీద సాముగా మారింది. ఊరంతా నీటిలో మునిగిపోవడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. బుధవారం ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీవీ సత్యనారాయణ.. వీఆర్‌వో పరమేశ్వరరాజును అప్రమత్తం చేశారు. ఒక బోటు ఏర్పాటు చేసి మృతదేహాన్ని దానిపై తరలించి అంత్యక్రియలు పూర్తి చేయించారు. ఎవరు మృతి చెందినా ఊరంతా కలసి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించే ఆ గ్రామంలో కనీసం బంధువులు కూడా వెంట వెళ్లలేని స్థితిలో అధికారులే 'ఆ నలుగురు'గా మారారు.

సామాజిక భద్రత కలిగిన గ్రామాలు తయారు కావాలి



పలు జిల్లాల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: సామాజిక భద్రత కలిగిన గ్రామం తయారు చేయవలసిన బాధ్యత జిల్లా స్థాయి అధికారులపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) ఈ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) సుస్థిరాభివృద్ధి లక్ష్యాల శిక్షణలో భాగంగా బుధవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణను ఆయన ప్రారంభించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు 'సామాజిక న్యాయం, సామాజికంగా భద్రత కలిగిన గ్రామం' అనే అంశంపై శిక్షణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వ్యక్తిపై తప్పనిసరిగా శ్రద్ధ చూపాలన్నారు. బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా తీసుకోవాలన్నారు. అందరికీ సామాజిక రక్షణ పథకాలు అమలు చేయడం, భరోసా ఇవ్వడం, ఉపాధి హామీ పథకం ద్వారా పేదరికాన్ని తగ్గించడం, విభిన్న ప్రతిభావంతులకు మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్‌ధన్‌ను పంచాయతీ స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ శిక్షణలో ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, పద్మజ, వి.ప్రసాద్‌లు శిక్షణ నిర్వహించారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల అందజేత

దేశ ప్రగతికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కీలకమని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని జిల్లా స్థాయి అధికారులకు 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఆరోగ్యకరమైన గ్రామం' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన 7వ బ్యాచ్ ముగింపు శిక్షణలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఇప్పటి వరకు ఏడు అంశాలపై శిక్షణ పూర్తి కాగా 8వ అంశంపై బుధవారం శిక్షణ ప్రారంభం అయిందన్నారు. వీటిపై జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడంతో స్థానిక ఈటీసీలో 11 జిల్లాలోని అధికారులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి, శిక్షణపై అభిప్రాయాలను సేకరించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, కేఎస్ఆర్ నిహారిక, బి.ఆంజనేయులు, బి.వెంకటేశ్వర్లు, చక్రపాణిరావు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు సత్వరమే కావాలి

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల దృష్ట్యా, ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ ప్రయత్నాలకు సాయం చేయడానికి అత్యవసరంగా నైపుణ్యం కలిగిన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అవసరమని బొమ్మూరులోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్) రీజినల్ డైరెక్టర్ పి.మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ప్లంబింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు జరిగిన విస్తారమైన నష్టం భద్రతను నిర్ధారించడానికి, రికవరీని సులభతరం చేయడానికి తక్షణ చర్యలు అవసరమన్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని అర్హత, అనుభవం కలిగిన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అర్జంటుగా కావాలన్నారు. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లకు ఆధార్‌కార్డ్, పాన్ కార్డ్, సర్టిఫికెట్/స్కిల్ సర్టిఫికెట్/లేబర్ కార్డ్/ఈ-శ్రమ్ కార్డ్, పని-రేట్ చార్ట్ ఆధారంగా రోజువారీ రూ.1000 ఇవ్వడం జరుగుతుందన్నారు. విజయవాడలోని ఆరు ప్రదేశాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉమ్మడి సేవా కేంద్రాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం బొమ్మూరులోని జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్)లో ప్లంబర్లు జయలక్ష్మి, ఎలక్ట్రీషియన్లు మహాలక్ష్మిలను కలవాలని రీజినల్ డైరెక్టర్ పి.మురళీధర్ తెలిపారు. ఇతర వివరాలకు 9866443303 (జే.రాజు)ను సంప్రదించాలన్నారు.

మహాత్ముల తపస్సు మానవాళికి రక్ష

సామవేదం షణ్ముఖ శర్మ



రాజమహేంద్రవరం రూరల్: ఏ కాలంలోనైనా మహాత్ముల తపస్సు మానవాళికి రక్ష అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. కొంతమూరులోని వల్లభ గణపతి ఆలయం వద్ద గల ప్రవచన మందిరంలో ఆయన కల్కి వైభవం అనే అంశంపై బుధవారం ప్రవచన పరంపరను ముగించారు. మన దేశంలో మహాత్ముల తపస్సుతో పునీతమైన సిద్ధభూములు అనేకం ఉన్నాయన్నారు. సనాతన ధర్మంపై ఎన్ని దాడులు జరిగినా, మన ధర్మం నేటికీ చెక్కు చెదరకుండా ఉండటానికి మహర్షుల తపస్సే కారణమని చెప్పారు. కలియుగాంతంలో కల్కి పురుషుని దర్శనానికి కృతయుగ పురుషుడు, ధర్ముడు, అనేక మంది మహర్షులు తరలి వస్తారన్నారు. కల్కి తనతో పాటు ధర్ముడు, ఇతర మహర్షులతో కలిసి కలిపై యుద్ధానికి వెళతాడని, కలి దోషాలను సంహరించి, తిరిగి కృతయుగాన్ని ప్రతిష్ఠ చేస్తాడన్నారు. బదరికాశ్రమంలో నరనారాయణులు తపస్సు చేస్తూ, సనాతన ధర్మాన్ని, పరంపరగా వస్తున్న వేదవిద్యలను, తపస్సునూ, తపస్వులనూ రక్షిస్తూనే ఉంటారని సామవేదం అన్నారు. ధర్మమే నిజమైన కోర్కెలను తీరుస్తుందని ప్రబోధించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సోలార్.. సో బెటర్

- పీఎం సూర్యఘర్‌కు పెరుగుతున్న ఆదరణ
- సబ్సిడీతో పాటు రుణ సదుపాయం కల్పిస్తున్న కేంద్రం
- విద్యుత్ ఉత్పత్తి, వాడకం తెలుసుకునే అవకాశం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2379 దరఖాస్తులు
- ఇప్పటి వరకూ 367 విడుదల
- జరుగుతున్న 361 సోలార్ రూఫ్‌టాప్ పనులు



సోలార్ ప్యానల్ సిస్టమ్

రాజమహేంద్రవరం సిటీ: సహజ వనరుల్లో విండ్ పవర్, జియో థర్మల్ పవర్, సోలార్ పవర్ ఇలా ఎన్నో ఉన్నా... జనమంతా సోలార్ పవరే సో బెటర్ అంటున్నారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లపాటు (2023–24 నుంచి 2026–27) కొనసాగే విధంగా తీసుకుని వచ్చిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆదరణ పొందుతోంది. కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్‌తో నెలకు 120 యూనిట్లు, 2 కిలోవాట్‌కు 240 యూనిట్లు, 3 కిలోవాట్‌కు 360 యూనిట్ల పైబడి విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా గణనీయంగా విద్యుత్ బిల్లు ఆదా కానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో ఇప్పటి వరకూ ఈ పథకం కోసం 2379 మంది గృహ యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 718 మంది అప్లికేషన్ ఫీజు చెల్లించారు. 367 సర్వీసులు విడుదల చేయగా 361 సర్వీసులకు సంబంధించి సోలార్ రూఫ్‌టాప్ పనులు జరుగుతున్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.తిలక్‌కుమార్ తెలిపారు.

పథకంలో చేరాలంటే..

ముందుగా సూర్యఘర్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాలు నమోదు చేయాలి. ఆరు నెలల కరెంటు బిల్లు కాపీని జతపరచాలి. తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇందులో కిలోవాట్‌ను బట్టి సబ్సిడీ అందనుంది. మిగిలిన మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నారు. పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలు అప్‌లోడ్ చేయాలి. సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం 30 రోజుల్లో చెల్లిస్తుంది. ఒక కిల్‌వాట్ రూఫ్ టాప్ కెపాసిటీ కోసం 3–4 ప్యానల్స్ అమర్చనున్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్ నెలకు దాదాపు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనుంది. వినియోగదారులు పెట్టిన పెట్టుబడి ఆరు నుంచి ఏడేళ్లలో తిరిగి పొందే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

రాయితీ ఇలా..

సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి 1 కిలోవాట్ ప్లాంట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్ ప్లాంట్‌కు ఏర్పాటు చేసుకున్న వారికి రూ.60 వేలు, 3 కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నవారికి రూ.78 వేలు గరిష్ఠ రాయితీ అందుతుంది.

ఎవరికి ఎంత కెపాసిటీ కావాలంటే..

- నెలకు 0–150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1–2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది.
- 150–300 యూనిట్లు చొప్పున వినియోగించే వారు 2–3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంటును ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాల వారీగా నమోదు చేసుకున్న వారు

జిల్లా	అప్లికేషన్ల సంఖ్య	పూర్తయినవి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	538	65
కాకినాడ	1084	152
తూర్పుగోదావరి	598	119
అల్లూరి సీతారామరాజు జిల్లా	159	0
	2379	336

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



గృహ యజమానులే (వినియోగదారులు) సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అద్భుతమైన పథకం పీఎం సూర్యఘర్ పథకం. సోలార్ విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ, రుణ సదుపాయం అందిస్తుంది. పెట్టిన పెట్టుబడి ఏడేళ్లలో తిరిగి పొందవచ్చు. నెట్‌మీటర్ విధానం ద్వారా విద్యుదుత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. సందేహాలుంటే ట్రాన్స్‌కో అధికారులు నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– **కె.తిలక్‌కుమార్**, ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్, రాజమహేంద్రవరం

ఉమ్మడిగానూ ఏర్పాటు చేసుకోవచ్చు

నివాసుల సంక్షేమ సంఘాలు, బృందంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు ఉమ్మడి ప్రాంతంలోని విద్యుద్దీపాల ఏర్పాటుకు ఈ విధానం ఏర్పాటు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఇలా..

ముందుగా పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో యజమాని పేరును రిజిస్టర్ చేసుకోవాలి. ఇందుకోసం మీ రాష్ట్రం, విద్యుత్ సరఫరా చేసే కంపెనీని ఎంచుకోవాలి. మీ విద్యుత్ కనెక్షన్ కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబరు, ఈ–మెయిల్ ఐడీని ఎంటర్ చేయాలి. కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్ లాగిన్ అవ్వాలి. అక్కడ రూఫ్ టాప్ సోలార్ కోసం అప్లయ్ చేసుకోవాలి.

అనుమతులు వచ్చే వరకు..

అనుమతి వచ్చిన తర్వాత మీ డిస్కమ్‌లోని నమోదిత విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టలేషన్ పూర్తయిన తర్వాత, ఆ ప్లాంట్ వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నెట్ మీటర్‌ను ఇన్‌స్టాల్ చేశాక, డిస్కమ్ అధికారులు తనిఖీలు చేస్తారు. అనంతరం పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ రిపోర్ట్ పొందిన తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతో పాటు క్యాన్సిల్డ్ చెక్కును పోర్టల్‌లో సబ్‌మిట్ చేయాలి. 30 రోజుల్లోగా మీ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది.